17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
మంగళవారం | 4 జూన్ 2024 | పేజీలు 9

## ఇస్కాన్‌లో వైభవంగా అపర ఏకాదశి సంబరాలు



వివరాలు 4లో

## కౌంటింగ్ కేంద్రం ఐజీ పరిశీలన

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఐజికెవి మోహన్ రావు పరిశీలించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన చిత్తూరు నగర సమీపంలోని ఎస్‌విసెట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి సమీక్షించారు.

8లో





# టిక్.. టిక్.. టిక్..
# నేడే కౌంటింగ్

ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగనున్న కౌంటింగ్ ప్రక్రియ

తొలి ఫలితం సత్యవేడు

చివరి ఫలితం చంద్రగిరి

శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం

జిల్లా ఎన్నికల అధికారి

మరికొన్ని గంటలలో తిరుపతి జిల్లా ప్రజా ప్రతినిధుల భవితవ్యం తేలనుంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టారు. అభ్యర్థులకు కౌంటు డౌన్ ఉదయం నుంచే మొదలవుతుంది. జిల్లాలో పోలింగ్ అనంతరం చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్

వివరాలు 5లో

## కలెక్టర్, ఎస్పీలతో జిల్లా అబ్జర్వర్ల సమీక్ష

- బందోబస్తు ప్రణాళికను జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కొరకు గట్టి భద్రతా చర్యలు
- కౌంటింగ్ కేంద్రం నుండి ఔటర్ కార్డెన్ వరకు సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ లను అమలు చేస్తున్నాం
- ప్రతి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్స్ వద్ద ఏర్పాటు చేసి ఉన్న యాక్సిస్ కంట్రోల్‌ల ద్వారా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలన
- నిషేధిత వస్తువులను నిలువరిస్తున్నాం
- ఔటర్ కార్డెన్ నుండి కౌంటింగ్ సెంటర్ వరకు అత్యవసర మార్గాలను నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు
- ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని అధిగమించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వర్తించేందుకు పోలీస్ శాఖ సర్వసన్నద్ధం

ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ రేపు శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరగనున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం వారిచేత నియమించబడిన జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్లతో సమావేశమై కౌంటింగ్ ప్రక్రియకు చేపట్టిన చర్యల గురించి సమీక్షించారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ శాఖ చేపట్టిన ప్రణాళికను గురించి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రతి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద యాక్సెస్ కంట్రోల్ ఏర్పాటు చేశాము. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతనే లోపలికి అనుమతిస్తాం. మహిళా యూనివర్సిటీ గ్రౌండ్ వద్ద మరొక యాక్సిస్ కంట్రోల్ ఏర్పాటు చేశాం. అక్కడ కూడా మరొకసారి క్షుణ్ణంగా తనిఖీలు జరిపిన తర్వాతనే కౌంటింగ్ సిబ్బందిని, ఏజెంట్లను, అధికారులను లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. ఔటర్ కార్డెన్ నుండి పార్కింగ్ ప్రాంతాలతో సహా కౌంటింగ్ కేంద్రం వరకు ఉన్న ప్రతి చెక్ పోస్ట్ వద్ద స్థానిక పోలీసులతో పాటు సాయుధ బలగాలను మోహరించి పటిష్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. అదే సమయంలో కౌంటింగ్ కేంద్రం నుండి ఔటర్ కార్డెన్ వరకు ఒక అత్యవసర మార్గాన్ని ఏర్పాటు చేశాం. ఈ మార్గం నిరంతరం అందుబాటులో ఉండేలాగా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రం వెనకవైపు కన్సర్టినా కాయిల్స్, బ్యారికెట్లు, ఫెన్సింగ్ లా ద్వారా మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటుతోపాటు సాయుధ బలగాల ద్వారా ఫుట్ పెట్రోలింగ్ పార్టీ, మొబైల్ పార్టీలను మోహరించి నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిన్న ఉదయం బందోబస్తు




మిగతా 2లో

### కౌంటింగ్ కేంద్రంలో
## ఓట్లు ఇలా లెక్కిస్తారు

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:**

ఎన్నికల కౌంటింగ్? వేళ మీడియాలో వచ్చే సమాచారం గురించి అందరికీ తెలుసు. కానీ.. అసలు కౌంటింగ్ కేంద్రం లోపల ఏం జరుగుతుందో మీకు తెలుసా?

పోలింగ్ జరిగిన రోజున ఈవీఎంలను.. ఆ నియోజకవర్గంలోనే ఒక ప్రాంతంలో భద్రపరుస్తారు. దాన్నే స్ట్రాంగ్ రూమ్ అంటారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రం కూడా అదే. అందులోనే ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా టేబుల్స్ ఏర్పాటు చేస్తారు. ఈ టేబుల్స్ 14 ఉంటాయి. ఒక్కో టేబుల్ మీద ఒక్కో ఈవీఎం ఉంచి ఓట్లను లెక్కిస్తారు. ఈ14 ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వెల్లడించే ఫలితాన్ని ఒక రౌండ్ రిజల్ట్ అంటారు. అయితే ఆయా నియోజకవర్గాల్లో నమోదైన ఓట్ల సంఖ్యను బట్టి.. రౌండ్ల సంఖ్య ఆధారపడి ఉంటుంది.

**ఈవీఎంలు ఇలా తెరుస్తారు...** ఈవీఎం యంత్రంలోని రిజల్ట్ విభాగానికి ఒక సీల్ ఉంటుంది. ముందు దాన్ని తొలగిస్తారు. ఈవీఎం బయటి కప్పును మాత్రమే ఓపెన్ చేస్తారు. లోపలి భాగాన్ని తెరవరు. ఆ తర్వాత ఈవీఎం పవర్ ఆన్ చేస్తారు. అనంతరం.. లోపల ఒక బటన్ తీరుగా మరో సీల్ ఉంటుంది. దాన్ని తొలగిస్తే లోపల రిజల్ట్స్ బటన్ కనిపిస్తుంది. దాన్ని నొక్కితే ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయో స్క్రీన్? మీద కనిపిస్తుంది. ఆ వివరాలను అధికారులు జాగ్రత్తగా నోట్ చేసుకుంటారు.

**ముందుగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్**

కౌంటింగ్?లో ముందుగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన ఓట్లను లెక్కిస్తారు. ఈవీఎంల కోసం ఏర్పాటు చేసే 14టేబుళ్లు కాకుండా పోస్టల్ బ్యాలెట్? కోసం ప్రత్యేకంగా మరో టేబుల్ ఉంటుంది. ఈ పోస్టల్ ఓట్లు లెక్కించిన అరగంట తర్వాత.. ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలు పెడతారు. ఒకవేళ పోస్టల్ ఓట్లు అరగంటలో పూర్తికాక పోయినా.. ఈవీఎం ఓట్ల కౌంటింగ్ స్టార్ట్ చేస్తారు.

**కౌంటింగ్ ఏజెంట్లు...** అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు మొదలు. రిజల్ట్ అనౌన్స్ వరకు బాధ్యత మొత్తం రిటర్నింగ్ ఆఫీసర్‌దే. ఈ అధికారి వివిధ పార్టీలకు చెందిన

మిగతా 2లో

# కలెక్టర్, ఎస్పీలతో జిల్లా అబ్జర్వర్ల సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బందితో ఒకసారి సమావేశమై నిర్వర్తించవలసిన విధుల గురించి బ్రీఫింగ్ చేయడం జరిగింది. సాయంత్రం మరొక్క సారి నేరుగా వారి పాయింట్లు వద్ద క్షేత్ర స్థాయిలో సమావేశమై, భౌగోళిక స్థితిగతుల కు అనుగుణంగా ఆయా పాయింట్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అనుసరించ వలసిన ప్రణాళిక గురించి వివరించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 85 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి, బైండోవర్ చేయడం జరిగింది. ఈ ట్రబుల్ మాంగర్ల గురించిన సమాచారం బందోబస్తు విధులలో ఉన్న పోలీసులు అందరికీ అవగాహన ఉన్నది ఒకవేల వారు ఎవరైనా తారసపడితే వెంటనే వారిని అదుపులోకి తీసుకొని ముందస్తు అరెస్టు చేస్తామన్నారు.గత 15 రోజుల నుండి జిల్లాలో విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, ఫ్లాగ్ మార్చ్ లు, నాకా బందీలు, వాహనాల తనిఖీలు వంటివి నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాము. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు పంపాము. జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే 630 మందిని బైండోవర్ చేశామన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ కొరకు ఒక అదనపు ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 350 మంది పోలీసులు, సాయుధ బలగాలు, కేంద్ర బలగాలను మొహరించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నా మన్నారు. జిల్లాలో ఎలాంటి ఘటనలు జరగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగింది. ఏజెంట్లకు గాని ఇతరులు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అలాంటి వారి కోసం ప్రత్యేకంగా ఆంబులెన్స్ లు కూడా ఏర్పాటు చేస్తున్నాం.అంతేకాకుండా కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో ఏదైనా ఫైర్ యాక్సిడెంట్ జరిగితే ముందస్తుగా అలాంటి వాటిని కూడా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా ఫైర్ ఇంజన్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఇదే స్ఫూర్తితో రేపు జరగబోయే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేస్తామని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు ఉజ్వల్ కుమార్ ఘోష్ కే. జ్యోతి శ్రీ కైలాష్ వంకడే డాక్టర్ జోష్ణ పడియార్ కౌంటింగ్ అబ్జర్వర్ కె.వి. మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అదనపు ఎస్పీలు, జాయింట్ కలెక్టర్, ఆర్వోలు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు ఇలా లెక్కిస్తారు

(మొదటిపేజీ తరువాయి)

కౌటింగ్ ఏజెంట్లు, పోటీచేసిన అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈవీఎం తెరుస్తున్నప్పుడు.. దాని సీల్ సరిగా ఉందా లేదా? అని ఏజెంట్లకు చూపిస్తారు. వారు సరిగానే ఉందని నిర్ధారించుకున్న తర్వాతనే ఓపెన్ చేస్తారు. ఏదైనా తేడా ఉందని భావిస్తే.. ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తారు. ఓపెన్ చేసిన ఈవీఎం లోని ఓట్ల ఫలితాలను వారికి చూపించి వారు సంతృప్తి చెందిన తర్వాత వారి సంతకాలు తీసుకుంటారు. ప్రతీ కౌంటింగ్ టేబుల్ వద్ద.. సూపర్ వైజర్, అసిస్టెంట్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ఒక రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత.. ఏజెంట్లు సంతృప్తి చెందిన తర్వాతనే రిజల్ట్ ప్రకటిస్తారు. ఏ రౌండ్?లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి? అనే వివరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డు మీద రాస్తారు. ఆ తర్వాతే అనౌన్స్ చేస్తారు. ఇలా జరిగే కౌంటింగ్? మొత్తం వీడియో తీసి భద్రపరుస్తారు.

**వీవీ ప్యాట్ల లెక్కింపు...** ఓటు వేస్తున్నప్పుడు మొరాయించినట్టుగానే.. కౌంటింగ్? సమయంలో కూడా కొన్ని ఈవీఎంలు మొరాయిస్తాయి. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాకపోతే.. అప్పుడు వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. అభ్యర్థుల గుర్తుల వారీగా బాక్సులు ఏర్పాటు చేసి, వారికి పోలైన స్లిప్పులను అందులో వేస్తారు. ఆ తర్వాత లెక్కిస్తారు. ఒక్కో వీవీ ప్యాట్ యంత్రంలోని స్లిప్పులు లెక్క బెట్టాలంటే.. దాదాపు గంట పట్టే ఛాన్స్ ఉంది. అయితే.. వీవీప్యాట్‌లు లెక్కించాల్సి వస్తే.. అన్నీ ఒకేసారి ఓపెన్ చేయరు. ఒకదాని తర్వాత మరొకటి తెరుస్తారు. దీనివల్ల ఫలితం ఆలస్యమవుతుంది. ఇలా ఎంతో పకడ్బందీగా ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

# ముగిసిన ఉచిత వేసవి శిక్షణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** వేసవి సెలవు నేపథ్యంలో సమ్మర్ క్యాంప్‌లో అభ్యసించిన పిల్లలు వివిధ రకాల ఆట, పాటల నైపుణ్య ప్రదర్శనలతో పిల్లల్లోని సృజనాత్మకత వెల్లువిరిసింది. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని గత నెల రోజుల పాటు యశోదనగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో పిల్లలకు, మ్యాజిక్, పాటలు, చిత్రలేఖనం, చెస్ కర్రసాము వంటి ఆటలలో ఉచితంగా శిక్షణ కల్పించారు. సమ్మర్ క్యాంప్ ముగింపు ఉత్సవం సోమవారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు వివిధ కళారూపాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం పిల్లలు దేశభక్తిగీతాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరింపజేశారు. కొందరు పిల్లలు మ్యాజిక్ ట్రిక్స్లో భాగంగా తలపై మంటలు పెట్టుకునే మ్యాజిక్ ను ప్రదర్శించి అబ్బుర పరిచారు. చిన్నారులతో పాటు పెద్దలు సైతం కర్రసామును చేసి ఆకట్టుకున్నారు.

అనంతరం వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి జూన్ 2వ తేదీవ రకు తాము చేనేట్టిన సమ్మర్ క్యాంపులో వివిధ రంగాల్లో నిష్ణాతులైన గురువుల కృషితో పిల్లలు బాగా రాణించారని తెలిపారు. యాంత్రికంగా ఉన్న పిల్లల జీవితాల్లో ఈ శిక్షణ ఉత్సాహం నింపిందని, వీరిలో సృజనను వెలికి తీయగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల, ప్రముఖ న్యాయవాది ఎం. పురుషోత్తం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోము రవికుమార్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్లో నేర్చుకున్న ఆట, పాటలు, మ్యాజిక్ వంటి అద్భుత రీతిలో ప్రదర్శించిన ఆకట్టుకున్న పిల్లలను ప్రశంసించారు. జానపద, శాస్త్రీయ నృత్య పోటీలలో ప్రతిభ చాటిన పిల్లలకు ప్రశంసా పత్రాలు అందించారు. వేసవి సెలవుల్లో విలువైన విద్యను పిల్లలకు అందించి వారిలో సృజనాత్మకత వెలికి తీసి ప్రోత్సహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో పిల్లలకు శిక్షణ కల్పించిన గురువులందరినీ శాలువ, జ్ఞాపికలు, పుస్తకాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. చిత్రలేఖనం, సైన్స్ టాలెంట్ టెస్ట్లో గెలుపొందిన వారికి జన విజ్ఞాన వేదిక నేతలు బహుమతులు ప్రధానం చేశారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు టెంకాలయ దామోదరం, నడ్డినారాయణ, మునిలక్ష్మి, గురునాథం, ఓ.వెంకట్రమణ, రఫీ, జన విజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్ బాబు, అరుణ్ శివప్రసాద్, గిరిధర్ మూర్తి, బిర్లా నాయుడు పాల్గొన్నారు.



# ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద నాలుగంచెల పటిష్ట భద్రత

### జిల్లా అంతటా సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌లను అమలు



**చిత్తూరు క్రైమ్, మేజర్‌న్యూస్:** మంగళవారం ఎస్‌విసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పారదర్శకంగా జరిపించేందుకు అన్ని భద్రతా ఏర్పాట్ల నడుమ పోలీసు శాఖ సంసిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు తెలిపారు. జిల్లా ఎస్పీ అధికారులు సిబ్బందికి సూచనలు చేస్తూ పోలింగ్ రోజున ఎలాగైతే శాంతిభద్రతలు కాపాడుతూ విధి నిర్వహణ చేసారో అదే స్ఫూర్తితో మంగళవారం జరగబోవు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజున శాంతిభద్రతలను ఎన్నికల సక్రమ తను కాపాడటం కోసం పోలీసులు తీసుకోవా ల్సిన చర్యలు ఎంతో ముఖ్యమని, వివిధ రకాల భద్రతా చర్యలను అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియను సక్రమంగా నిర్వ హించవచ్చు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రతి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన యాక్సెస్ కంట్రోల్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీలు జరిపిన తర్వాతనే కౌంటింగ్ సిబ్బం దిని, ఏజెంట్లను, అధికారులను లోపలికి అనుమతించాలని తెలిపారు. పాయింట్లు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అనుసరించవలసిన ప్రణాళిక గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రా లు, రహదారుల వద్ద కట్టుదిట్టమైన నిర్బం ధాన్ని కలిగి ఉండటం చాలా అవసరం. ఇది కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమానాస్పద వ్యక్తులు వాహనాలు ప్రవేశించకుండా నిరోధి ‚స్తుంది. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచడం ద్వారా ముప్పు ఉండే పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చు. సాంకేతిక మద్దతు కూడా చాలా ముఖ్యమని, కమ్యూని కేషన్ వ్యవస్థలు, వాకీటాకీలు ఇతర సాంకే తిక మద్దతులు ఎపుడూ అందుబాటులో ఉండాలి. ఉన్నతాధికారులు సిబ్బంది సమన్వ యంతో కౌంటింగ్ రోజున ఎటువంటి సమ స్యలు ఎదురుకాకుండా ఉండేలా చూడాలి. ఈ చర్యలను సరైన సమయానికి సరైన విధంగా అమలు చేయడం ద్వారా కౌంటింగ్ రోజున ఎన్నికల సక్రమతను శాంతిభద్రతను కాపాడవచ్చునని తెలిపారు. జిల్లా అంతటా సెక్షన్ 144 సి ఆర్ పి సి, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ లను అమలులో ఉంటుంది కావున ప్రజలు ముగ్గురికంటే ఎక్కువగా గుంపుల్లా తిరగకూడదని, సెక్షన్ 144 ఉల్లంఘిస్తే వారి పైన కఠినంగా చర్యలు తీసుకోడానికి ఏ మాత్రం వెనుకాడ పొమ్మన్నారు, క్యూఆర్టి వాహనలు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. వాటి కెమెరాల నుండి రికార్డ్ చేసిన ఫుటేజీ ద్వారా చట్ట ఉల్లంగణ చేసిన వారిపై చర్యలు తీసుకుంటాము. లెక్కింపు రోజున అమలులో ఉన్న ఆంక్షలు మార్గదర్శకాలను తెలుసుకొని ప్రజలు పోలీసు వారికి సహకరించాలని ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహిస్తుంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100, 112 కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005 కు తెలుపగలరని ఎస్పీ తెలియజేసారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిఫుల్లా, అడిషనల్ ఎస్పీ ఏ.ఆర్. జి.నాగేశ్వర రావు, చిత్తూరు సబ్ విజన్ డి.ఎస్పీ రాజగోపాల్ రెడ్డి, డి.టి.సి. డి.ఎస్పీ శ్రావణ్ కుమార్, ఏ.ఆర్ డి.ఎస్పీ ఇలియాస్ బాష, ట్రైనింగ్ డి.ఎస్పీ పవన్ కుమార్, పట్టణ ఇన్స్పెక్టర్‌లు, ఆర్‌ఐలు, ఎస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



## కిరణ్ కుమార్ రాజుకు డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి ఎమ్.కిరణ్ కుమార్ రాజుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్, ఆర్థిక శాస్త్ర విశ్రాంత ఆచార్యులు మేడసాని దేవరాజులు మార్గదర్శకత్వంలో " సోషియో ఎకనమిక్ కండిషన్స్ ఆఫ్ స్ట్రీట్ గార్మెంట్ వెండర్స్ ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూర్ డిస్ట్రిక్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను అతనికి డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు తెలిపారు. ఎమ్.కిరణ్ కుమార్ రాజు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం అధ్యాపకులుగా, విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఎమ్.కిరణ్ కుమార్ రాజుకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు శుభాకాంక్షలు తెలిపారు.

## సత్య గంగమ్మ హుండీ లెక్కింపు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** స్థానిక పట్టణంలోని పాత పేటలో ఉన్న సత్యగంగమ్మ దేవస్థానంకు సంబంధించి హుండీ లెక్కింపు నందు 86,702 రూపాయలు ఆదాయం వచ్చినట్లు చిత్తూరు జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఎం.రాధిక తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం నందు ఈవో, ఆలయ సిబ్బంది, అమ్మవారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నారావారిపల్లి వద్ద 15 బాటిల్ల మద్యం స్వాధీనం

### - ఒక్కరు అరెస్టు

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి మండలం నారావారిపల్లి సమీపంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై 15 బాటిళ్ళ మద్యం అక్రమంగా తీసుకెళ్తుండగా పోలీసులు మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకుని, వ్యక్తిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు నారావారిపల్లి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా భీమవరం కు చెందిన మునిశేఖర్ నాయుడు అలియాస్ బుల్లి నాయుడు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో 15 క్వాటర్ బాటిళ్ళ మద్యం అక్రమంగా తరలిస్తుండగా ఎస్సై అనిత పలువురు పోలీసులు పట్టుకున్నారు. దీంతో మునిశేకర్ నాయుడును అదుపులోకి తీసుకొని వాహనాన్ని మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి

### శ్రీకళ్యాణ వెంకటేశ్వరను వేడుకున్న టీడీపీ బీసీ నాయకులు జగన్నాథం కుటుంబం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నేడు జరగబోయే ఓట్ల లెక్కింపులో ఎన్డీఏ కూటమి అత్యధిక మెజారిటీ సీట్లుతో విజయం సాధించి తెలుగ దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారక కమిటీ సభ్యులు జగన్నాథం ఆకాంక్షించారు. సోమవారం జగన్నాథం కుటుంబ సభ్యులు, మిత్ర బృందంతో కలసి శ్రీనివాస మంగాపురం లోని శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామిని, తలకోనలోని సిద్దేశ్వర స్వామిని దర్శించుకుని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలకు రిజర్వేషన్లు కల్పించి వారికి అండగా నిలిచిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కళ్యాణ వెంకటేశ్వరుని, సిద్దేశ్వర స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజల దీవెనలతో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతున్నారని స్పష్టం చేశారు. రానున్న కూటమి ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, నేడు ఫలితాలలో ఎన్డీఏ కూటమికి అత్యధిక సీట్లు సాధించి రాష్ట్రంలో అరాచక పాలనను అంతం చేసి ప్రజాపాలనను తీసుకురావడం ఖాయమని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామారావు, బ్యాట్మెంటన్ కృష్ణ, చంద్ర, కామేశ్వరి, తేజశ్రీ, రోహిత్ బాబు, రాహుల్ ద్రావిడ్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## చింతమండి పరిసర ప్రాంతాల్లో పులుల సంచారం



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మండలం చింతామండి ఎంఎం.మిలాసం పంచాయితీ పెళ్లి చింతమను గ్రామం వంటపొలాల్లో పులులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. పంటపొలాల్లో పులులకు సంబంధించి పాదాలు ఏర్పడడంతో సంఘటన స్థలానికి రెవెన్యూ అధికారులు, అటవీ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు పరిశీలించారు. పరిసర ప్రాంతాలు ప్రజలు భయాందోళనతో చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పులులు బంధించాలని కోరుతున్నారు.

## పోలీసుల భారీ బందోబస్తు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు పోలీస్ బందోబస్తును పలమనేరు డిఎస్పి, అర్బన్ సీఐ చంద్రశేఖర్, సీఐ చిన్న గోవిందు, మోహన్ కృష్ణ,ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గొడవలు జరిగే గ్రామాలలో సోమవారం నుంచి ముగ్గురు నుండి నలుగురు పోలీసులను 5వ తేదీ వరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత కూడా ఏ పార్టీ వారైనా ఓడిపోయిన గెలిచిన సమన్వయం పాటించి ఉండాలని తెలిపారు. మంగళవారం షాపులు గాని హోటల్స్ గాని క్లోజ్ చేయాలని పై అధికారుల నుంచి మాకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. సోమవారం సాయంత్రం అనౌన్స్మెంట్ చేసి షాపులు హోటల్లు, మూసివేయాలన్నారు. వ్యాపారస్తులందరూ కూడా మాకు సహకరించాలని కోరారు. పట్టణంలో 144 సెక్షన్30 యాక్ట్ అమల్లో ఉండడంవల్ల నలుగురు మించి చేరి రెచ్చగొట్టే మాటలు మాట్లాడి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా వారి మీద కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సీఎం కావాలని మూలస్థానమ్మకు పూజలు

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. 300 టెంకాయలు కొట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రగిరిలో ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఒంగోలులో ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవాలని అమ్మవారిని వేడుకొన్నారు. రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు కైవసం చేసుకొని ముఖ్యమంత్రిగా రెండవసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మూలస్థానమ్మ ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ బండారు హేమచంద్ర రెడ్డి పలురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

### 14 మంది జాలర్లు అరెస్ట్

### రెండు కత్తులు, టెంపో వాహానం స్వాధీనం



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** కర్నాటక నుంచి నెల్లూరు జిల్లాకు వెళ్తున్న టెంపో వాహనంలో మద్యం బాటిళ్ల తరలిస్తున్న జాలర్లను పోలీసులు అరెస్టు చేసి మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. మద్యంతో పాటు వారి వద్ద రెండు కత్తులు ఉండటంతో పోలీసులు అనుమానితలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు కొందరు రౌడి మూకలు వచ్చినట్లు సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో దుష్ప్రచారానికి తెగబడ్డారు. ఈ మేరకు సోమవారం ఇంఛార్జ్ డీఎస్పీ రవి కుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్త సత్రం గ్రామానికి చెందిన సుమారు 13 మంది మత్స్యకారులు బతుకు దెరువు కోసం గత పదేళ్లుగా కర్నాటక రాష్ట్రంలోని మంగళూరు హార్బర్లో ఖాదర్ అనే వ్యక్తికి చెందిన బోటులో మత్స్య వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నారన్నారు. రెండు నెలల క్రితం మంగళూరుకు వెళ్లిన జాలర్లు పనులు ముగించుకుని కేఏ 50 ఏ 2643 నంబరు గల టెంపో ట్రావెలర్ వాహనంలో సోమవారం తిరుగు ప్రయాణమయ్యారన్నారు. ఈ క్రమంలో జాలర్లు 29 మద్యం బాటిళ్లు, 26 టిన్ బీర్లు, రెండు డ్రమ్ములలో పచ్చి ఎండు చేపలు, మూడు బాక్సులలో పచ్చి చేపలు, పనస కాయలతో పాటు రెండు కత్తులను తీసుకొచ్చారన్నారు. పనపాకం టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో మద్యంతో పాటు ఇతర వస్తువులను గుర్తించి విచారణ నిమిత్తం స్థానిక పోలీసు స్టేషన్‌కు వీరిని తరలించినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన వారంత జాలర్లుగా గుర్తించడం జరిగిందని, కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే జాలర్లు, వారి బందువుల కోసం మద్యం తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. త్వరలోనే వారి గ్రామంలో తిరునాళ్లు జరగనున్న నేపథ్యంలో మంగళూరులో రెండు కత్తులను కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. గతపదేళ్లుగా ఇలా మంగళూరుకు వెళ్లి వస్తుండేవారమని, వచ్చినప్పుడల్లా చేపలు, ఎండు చేపలు, మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నట్లు వారు విచారణలో తెలిపారన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు. విచారణ అనంతరం అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోనున్నట్లు డీయస్పీ వివరించారు.



### వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో, ఎల్లో మీడియాలో దుష్ప్రచారం..

బతుకుదెరువు చూసుకుని తిరిగి ఇంటికెళ్తున్న మత్యకారులు కౌంటింగ్ రోజున హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు కత్తులు, గొడ్డళ్లు, ఇనుప రాడ్లు, బాకులు తరలిస్తున్నారంటూ సోషల్ మీడియా, కొన్ని టీవీ ఛానల్స్‌లో దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. తిరుపతి ఎస్పీ హర్ష వర్ధన రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గట్టి బందోబస్తును నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోట చేసుకోకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపులో హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు మారణాయుధాలను తీసుకెళ్తున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకుని, సోషల్ మీడియాలో పెట్టాలే తప్ప ఇరలా తప్పుడు సమాచారాని ట్రోల్ చేయడం ద్వారా ప్రజలు భయభ్రాంతులకు గురవుతారని ఆయన అన్నారు. ఈ మీడియా సమావేశంలో సిఐ రామయ్య, ఎస్ఐ అనిత పలువురు పోలీసులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరుడు సేవలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి దంపతులు

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనం కొరకు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యం నిర్వహణ అధికారి ధర్మారెడ్డి సతీ సమేతంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులు సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.


టీటీడీ ఈవోకు స్వాగతం పలుకుతున్న శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులు

## శ్రీ శక్తి పీఠంను దర్శించుకున్న కేరళ ఐజి లక్ష్మణ్ నాయక్



రామచంద్రపురం మేజర్‌న్యూస్ : కేరళ క్యాడర్‌కు చెందిన ఐజీ లక్ష్మణ్ నాయక్ రాయల చెరువు నందు వెలసిన శ్రీ శక్తి పీఠం మహిమాన్విత క్షేత్రమని తెలుసుకొని సోమవారం ప్రధాన దేవత శ్రీ మరకత శక్తి కాళీ దేవుని దర్శనం చేసుకొని ముడుపులు చెల్లించారు. శ్రీ శక్తి పీఠం మేనేజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ వారికి పీఠం విశిష్టత దేవి దేవతల మహిమలను తెలియజేసినారు. అనంతరం కుర్తాళం సిద్దేశ్వరి పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతిస్వామి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి శ్రీశ్రీశ్రీ రమ్యానంద భారతీ స్వామిఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వారికి శేష వస్త్రాలతో వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు.

## వైభవంగా మృత్యుంజయ స్వామి అభిషేకం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో మృత్యుంజయ స్వామికి అభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర స్వామికి పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామికి పాలు, పెరుగు పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరలతో మృత్యుంజయ సామికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం పలు రకాల సుగంధ పరిమళ పుష్పాలతో మృత్యుంజయ స్వామిని శోభమయంగా అలంకరించి దీప దూప నైవేద్యాలు సమర్పించి కర్పూర హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా హర. హర. మహాదేవ శంభో. శంకర ఓం నమశ్శివాయ. నామస్మరణతో మార్మోగింది.



## శ్రీ కొండ మల్లేశ్వరస్వామికి అభిషేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ కొండమల్లేశ్వర స్వామి

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మాంబేడు పంచాయితీ డిఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ కొండ మల్లేశ్వర స్వామికి భక్తులు విశేష పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యే కంగా అలంకరించారు. పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పంచముఖ ఆంజనేయ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలతో భక్తులను అలరింపజేశారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వైభవంగా ధ్వజారోహణం

మండలంలోని తిరుమలయ్య పల్లి పంచాయతీ చెంచుగుడి మహాభారతం ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ధ్వజారోహణ కార్యక్రమం ఉభయదారులుగా ఎంపీటీసీ హరి విజయ శేఖర్ రెడ్డిలు వ్యవహరించారు. ధర్మకర్త పూల వెంకటరామిరెడ్డి, అనిల్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

## ఇస్కాన్‌లో వైభవంగా అపర ఏకాదశి సంబరాలు

- స్వామి అమ్మవార్లను ఫల పుష్పాకులతో అలంకరణ
- వందల సంఖ్యలో శ్రీ రాధాకృష్ణ స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్న భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**తిరుపతి కల్చరల్ మేజర్‌న్యూస్:** అపర ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఇస్కాన్ మందిరంలో సోమవారం అంగరంగ వైభవంగా అపర ఏకాదశి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ రాధాకృష్ణ స్వామి అమ్మవార్లను వేకుజామున మేల్కొల్పి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేశ విదేశాల నుంచి తెచ్చిన ఫల పుష్పాదులతో శ్రీ రాధాకృష్ణ అమ్మవార్లను గోపికలను అందంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు శ్రీ రాధాకృష్ణ గోపికలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ రాధాకృష్ణ గోపికలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఇస్కాన్ ప్రధాన అర్చకులు రేవతి రమణదాస్ ప్రభు, లీలా కృష్ణ పారాయణ దాస్ ప్రభు, మురళి గోవింద దాస్ ప్రభు, శ్రీహరి దాస్ ప్రభు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఇస్కాన్ మందిరంలో శ్రీ రాధాకృష్ణ గోపికలకు ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందని, ప్రతిరోజు ఉదయాన్నే అభిషేక కార్యక్రమాలు ముగిసిన తర్వాత ఉదయం 4.25 నిమిషాలకు మంగళహారతి, 7.30కు దర్శన హారతి, మధ్యాహ్నం 1.30 గంటలకు రాజ భోగ హారతి, సాయంత్రం 4 గంటలకు సాయంకాల హారతి, 6 గంటల 50 నిమిషాలకు సంధ్య హారతి, రాత్రి 8. 20 నిమిషాలకు హారతి కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. ప్రతి భక్తుడు శ్రీ రాధాకృష్ణ గోపికలను దర్శించుకుని మొక్కులు తీర్చుకొని పునీతుల కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతలను ఆకట్టుకున్నాయి.







## టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గెలవాలని ప్రత్యేక పూజలు

- కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న తెలుగు యువత

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** మంగళవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ప్రసాద్ రావు గెలవాలని తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీవారి మెట్టు సమీపంలోని భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో బుచ్చినాయుడు పల్లి మాజీ సర్పంచ్ వేణు ఆధ్వర్యంలో తెలుగు యువత ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ముందుగా సోమవారం ఉదయం తెలుగు యువత నాయకులు భక్తాంజనేయ స్వామి ఆలయంలో అంగప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో నూతన టెంకాయలు కొట్టి, పులివర్తి నాని, ప్రసాద్ రావు గెలవాలని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వేణు మాట్లాడుతూ, చంద్రగిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నాని ఎమ్మెల్యేగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల తర్వాత టిడిపి జెండాను చంద్రగిరి కోటపై ఎగరవేయడం జరుగుతుందని చెప్పారు. శ్రీవారి దయతో పాటు, ఆంజనేయ స్వామి దయతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులైన నాని, ప్రసాద్ రావులు గెలవాలని తమ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. వైసిపి రాక్షసపాలనను అంతం అందించడానికి ప్రజలు కసిగా టిడిపికి ఓటు వేశారని ఆయన తెలిపారు.




## మూడు కిలోల గంజాయి స్వాధీనం : వ్యక్తి అరెస్ట్

**చిత్తూరు క్రైమ్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి సుమారు మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ ఉలసయ్య తెలిపారు ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు మంగళవారం సీఐ ఉలసయ్య పర్యవేక్షణలో ఎస్సై ఇక్బాల్ సిబ్బంది కలసి స్థానిక వీరభద్రకాలనీలోని నీవా నది గట్టు వద్ద దాడులు నిర్వహించి షణ్ముగం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పట్టుకున్న గంజాయి విలువ సుమారు 50 వేలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అరెస్టు అయిన షణ్ముగం రాష్ట్రంలో నిషేదించిన గంజాయిని ఆంధ్ర-ఒడిస్సా బార్డర్ నుండి అక్రమంగా కొనుగోలు చేసి, వాటిని చిత్తూరుకి అక్రమ రవాణా చేసి, చిత్తూరు పట్టణంలో ప్రజలకు ఎక్కువ రేట్లకు అమ్ముతూ, డబ్బులు సంపాదిస్తున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితుడిని రిమాండ్ పంపినట్లు సిఐ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సిఐ ఉలసయ్య

# టిక్.. టిక్..టిక్... నేడే కౌంటింగ్

**- సర్వం సిద్ధం - కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్**

**తిరుపతి క్రైమ్ మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికలు 2024 లో భాగంగా నేడు (జూన్ 04న) జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో లోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని 7 అసెంబ్లీ , ఒక పార్లమెంటు నియోజకవర్గాలకు సంబందించి శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే ఓట్లు లెక్కింపు ప్రక్రియ కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, కౌంటింగ్ కేంద్రాలలో బ్యారీ కేడింగ్, టేబుల్స్, కుర్చీలు, ఏజెంట్లకు సీటింగ్, మౌలిక సదుపాయాలు కల్పన, పటిష్ట బందోబస్తు చర్యలు, పార్కింగ్ ఏర్పాట్లు, మీడియా సెల్ ఏర్పాటు, తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ ద్వారా భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్న సిబ్బందికి తగిన శిక్షణ, సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో మొదలు అవుతుందని, 8.30 గం.లకు ఈవిఎంల లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఉదయం 7 గం.లకు అబ్జర్వర్లు, అభ్యర్థులు, ఏజెంట్లు సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరచి సంబంధిత కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. తిరుపతి పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ మొత్తం 14 టేబుల్ లు, 3 రౌండ్లలో పూర్తి అయ్యేలా సాయంత్రం 4గం. లకల్లా ఫలితాలు వెల్లడించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.120-గూడూరు కు సంబంధించి 294 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసికు 14, అసెంబ్లీకి 14 టేబుల్‌లు ఏర్పాటుతో 21 రౌండ్లు సుమారు సాయంత్రం 3.50 గం.లకు ఫలితాలు ప్రకటించేలా, 121-సూళ్లూరుపేట కు సంబంధించి 304 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసి కొరకు 14, అసెంబ్లీ కి 14 టేబుల్ లు ఏర్పాటుతో 22 రౌండ్లు సుమారు సాయంత్రం 4.10 గం. లకు ఫలితాలు ప్రకటించేలా, 122- వెంకటగిరి కి సంబంధించి 299 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసి కొరకు 14, అసెంబ్లీ కొరకు 14 టేబుల్ లు ఏర్పాటుతో 22 రౌండ్లు సుమారు సాయంత్రం 4.10 గం.ల వరకు ఫలితాలు ప్రకటించేలా, 167- తిరుపతి కి సంబంధించి 274 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసికి 14, అసెంబ్లీకి 14 టేబుల్ లు ఏర్పాటుతో 20 రౌండ్లు సుమారు సాయంత్రం 3.30 గం.ల వరకు ఫలితాలు ప్రకటించేలా, 168- శ్రీకాళహస్తికి సంబంధించి 293 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసి కొరకు 14, అసెంబ్లీ కొరకు 14 టేబుల్‌లు ఏర్పాటుతో 21 రౌండ్లు సుమారు సాయంత్రం 3.50 గం.ల వరకు ఫలితాలు ప్రకటించేలా, 169- సత్యవేడు కి సంబంధించి 279 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసి కొరకు 14, అసెంబ్లీ కొరకు 14 టేబుల్ లు ఏర్పాటుతో 20 రౌండ్లు సుమారు సాయంత్రం 3.30 గం.ల వరకు ఫలితాలు ప్రకటించేలా, చిత్తూరు పార్లమెంట్ నియోజక వర్గ 166- చంద్రగిరి అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి 397 పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో పిసి కొరకు 20 అసెంబ్లీ కొరకు 20 టేబుల్ లు ఏర్పాటుతో 20 రౌండ్లు సుమారు సాయంత్రం 3.30 గం.ల వరకు ఫలితాలు ప్రకటించేలా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రతి రౌండ్ సరాసరి 3 గం.లు పడుతుందని ఏడు నియోజక వర్గాలకు సంబంధించి 22,795 పోస్టల్ బ్యాలెట్, ఈటిపిబిఎస్ కలిపి మొత్తం ఉండగా, మొత్తం 28 టేబుల్‌ల ఏర్పాటుతో 15 రౌండ్లలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అసెంబ్లీ నియోజక వర్గ, పార్లమెంట్ నియోజక వర్గ కౌంటింగ్ సంబంధిత ఎ ఆర్ ఓ, ఆర్ ఓ లు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బెల్ ఇంజినీర్లు అందుబాటులో ఏర్పాటు చేశామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్ ప్రారంభమైన తర్వాత ఆగరాదని ఫలితాలు ప్రకటించే వరకు కొనసాగాలని తెలిపారు. ఈసిఐ నిబంధనల మేరకు కౌంటింగ్ జరగాలని సూచించారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత సీలింగ్ ఆఫ్ ఈవిఎం లు మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ కేంద్రం లోనికి సెల్ ఫోన్ అనుమతి లేదని తెలిపారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయం తుది నిర్ణయం అని నిబంధనలు మేరకు చర్యలు ఉండాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు ఎలాంటి గొడవలకు తావివ్వరాదని అలాంటి సందర్భంలో రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు పోలీసుల చర్యలు ఉంటాయని సీసీటీవీలో ప్రతి అంశం రికార్డు అవుతుందని, అందరూ కౌంటింగ్ సజావుగా నిబంధనల మేరకు జరిగేలా సహకరించాలని కోరారు. ఉదయం 5:15 గంటలకు మూడవ ర్యాండమైజేషన్ చేపట్టి వారికి టేబుల్ కేటాయించడం జరుగుతుందని ఎన్నికల కమిషన్ నుండి మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. రౌండ్ వారీగా మీడియా సెంటర్ కు కౌంటింగ్ ఫలితాలు అందజేయాల్సి ఉంటుందని సంబంధిత రిటర్నింగ్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో బాణసంచా పేల్చడం, కాల్చడం పూర్తిగా నిషేధం అని పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీలు విజేతలు గానీ, వారి అనుచరులు గానీ, ఊరేగింపులు నిర్వహించడానికి వీలులేదని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.









## ఏనుగు భీభత్సం.. టమోటా పంట ధ్వంసం

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని పందిలి పల్లి పంచాయతీ చుక్కావారి పల్లి అటవీ ప్రాంత మైన మధురమలై పరిసర ప్రాంత రైతు దేరం గుల చిన్నబ్బ పొలంలో ఒంటరి ఏనుగు భీభత్సం సృష్టించింది. అసలే టమోటా రైతులు ఆశాజనకంగా రేట్లున్న తరుణంలో గత రెండు నెలలుగా రూ.120లు పలికిన బాక్స్ ధర. ఈ సీజన్లో 550 పలుకుతున్నడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా ఏనుగు వచ్చి తమ పంటను తొక్కివేసి అపార నష్టం కలిగించిదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకొని తనకు పంట నష్టపరిహారం ఇప్పించవలసిందిగా రైతు వాపోయాడు.





# చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**-డిఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియ రేపు తిరుపతి పద్మావతి కాలేజీలో నిర్వహించబడుతున్న నేపథ్యంలో శ్రీకాళహస్తి డివిజన్ డీఎస్పి ఉమామహేశ్వర రెడ్డి పత్రికా విలేకరులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ రోజు జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కోసం పగడ్బందీగా సిద్ధమవుతున్నారు. ఓట్ల లెక్కింపు పురస్కరించుకొని శ్రీకాళహస్తి డివిజన్ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు కఠిన ఆంక్షలు అమలు చేస్తామన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థుల భవిష్యత్తు ఏంటో తేలిపోయే రోజు వచ్చేసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరన్న తీర్పు వెల్లడయ్యే సమయం ఆసన్నమైంది. ఓట్ల లెక్కింపునకు ఇక కొన్ని గంటలే మిగిలి ఉందనీ. ఈ కీలకమైన రోజు కోసం అభ్యర్థులు, ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించడంతోపాటు, ఆ తరువాత పల్లెలు, పట్నాల్లో శాంతిభద్రతలు కాపాడే దిశగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి పట్టణంలో మరియు చుట్టుపక్కల గ్రామాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులు ఎవరో గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టారు. ఓట్ల లెక్కింపు తరువాత గొడవల జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉండడంతో, శాంతి భద్రతలను కాపాడే దృష్ట్యా శ్రీకాళహస్తి డివిజన్ లో120 మందితో పోలీసుల బృందం గ్యాస్ పార్టీ 2టిం మరింత కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని, 144 సెక్షన్ పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉండడంవల్ల ప్రజలు నలుగురికి మించి ఎవరు ఎక్కడ గుమిగూడి ఉండకూడదని, ప్రజలకు తెలియజేశారు. విజయోత్సవ ర్యాలీలు, సభలకు అనుమతులు నిరాకరించారు. అల్లర్లు సృష్టించినా.. బాణాసంచా కాల్చడం లాంటి చర్యలు చేపడితే చట్టాలను అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అదే క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు సైతం గొడవలకు అవకాశం ఇవ్వకుండా సంయమనం పాటించాలని, ఈ మేరకు తమ అనుచరులు, సహచరులకు సూచించాలని కోరుతున్నారు.

## ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** రేపు జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మాజీ మంత్రి అమర నాథ రెడ్డి సూచించారు. పలమనేరు టీడీపీ కార్యాలయయంలో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఓట్ల కౌంటింగ్ లో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించడంతో వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆయన వారినుద్దేశించి మాట్లాడారు... కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి చివరి దాకా అందరు అప్రమత్తతో వ్యవహారించాలన్నారు. ఎన్నికల నియమావళిలోని నిబంధనలను పాటించాలని ఏదేని సమస్యలు, అభ్యంతరాలు తలెత్తితే ఎన్నికల అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రధానంగా పోస్టల్ బ్యాలెట్ విషయంలో చాలా జాగ్రత్త అవసరమని ప్రతి ఒక్కరు కౌంటింగ్ ముగిసే వరకు ఉండాలన్నారు. మొత్తం 21రౌండ్లు ఉంటాయని అన్ని రౌండ్స్ జరిగే దాకా ఎవరు సంయమనం కోల్పోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకుల ఆర్వి బాలాజీ, రామచంద్ర నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కిషోర్ గౌడ్, ఎల్ భాస్కర్, సోమశేఖర్ గౌడ్,రంగనాథ్,సుబ్రహ్మణ్యం గౌడు, గిరిలతోపాటు పలువురున్నారు.

## విద్యార్థులకు బహుమతులు పంపిణీ



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ముని కుమార్

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఐఓ అబాకస్ మెంటల్ ఆర్థమెటిక్ టీచర్ అసోసియేషన్ చెన్నై సంస్థ వారు 19 వతేది మే నెల 2024 రోజున నిర్వహించిన 24 వ అంతర్జాతీయ ఆన్ లైన్ అబాకస్ కాంపిటీషన్ శ్రీకాళహస్తి పట్టణం లిటిల్ మాస్టర్ అబాకస్ ఇన్స్టిట్యూట్ నుండి పాల్గొన్న విద్యార్థుల్లో విజయం సాధించిన 9 మంది విద్యార్థులకు నేడు కార్యక్రమంలో 03/06/2024 న బహుమతులు పంపిణీలో ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ గా పి. తనీష్-1 ఫస్ట్ లెవెల్, పి. తేజస్వి -1 ఫస్ట్ లెవెల్, జి. సాయి పూజిత, -1 లెవెల్, ఛాంపియన్ గా . జశ్వంత్- 1 లెవెల్ , బి. బావగ్న- 2 లెవెల్, బి. యువల్ ప్రీతం - 4 లెవెల్, టాపర్ గా జె. గురు సాత్విక- 2 లెవెల్, సి. హెచ్. నంద కిషోర్ - 2 లెవెల్, ఎ. భానుమూర్తి -7 లెవెల్ విద్యార్దులు తమ ప్రతిభను చాటి వివిధ స్థాయిలలో గెలుపొంది అవార్డులను కైవసం చేసుకున్నారు. తమ ఇన్స్టిట్యూట్ నుండి మొదటి, రెండవ. మూడవ స్థానాలలో అవార్డులను కైవసం చేసుకొన్న విద్యార్దులను డైరెక్టర్ దివ్య చైర్ పర్సన్ మునికుమార్ విద్యార్దులను అభినందించారు.

## ఘనంగా పాశిం సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు



**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధిని కోరుకు పనిచేసే పాశిం సునీల్ కుమార్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఉన్నత పదవులు పొందాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి కోరారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మెప్మా పునరావస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన ఓడిపోయిన ప్రజలకు నిరంతరం సునీల్ కుమార్ అందుబాటులో ఉన్నారని గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు పొంది ఆయురారోగ్యాలతో ఉండాలని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు,పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, శివకుమార్, నరసింహుల నాయుడు, వెంకటేష్, శ్రీధర్, లీలావతి, కల్పనా, భారతి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ డిప్లొమా కోర్సుకు నోటిఫికేషన్ విడుదల

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం



నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆ వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.సి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులో చేరే విద్యార్థులకు పదోవ తరగతి విద్యార్హత అని తెలిపారు. ఇంటర్ ఫెయిల్ అయిన విధ్యార్ధులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్ధులు 2024 ఆగస్ట్ 31 నాటికి 15 నుంచి 22 సంవత్సరాలు మద్య వయసు కలిగి ఉండాలన్నారు. గ్రామీణప్రాంతాలలో ఇంగ్లీష్ చదివిన వారికి, మున్సిపాలిటి పరిధిలో చదివిన వారికీ 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. ఈ కోర్సులకు జూన్ 1 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు. ఆన్లైన్ రెజిస్ట్రేషన్, ఇతర వివరాలకు కోసం 0877-2249909, 9618167187 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

-ఎస్ ఐ విజయ్ కుమార్ నాయక్
- ఎన్నికల కోడ్ తో పాటు 144 సెక్షన్ అమలు పై ప్రత్యేక దృష్టి
- పోలీసులతో పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు


చిన్నగొట్టిగల్లులో పోలీసులతో పహార కాస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్

**చంద్రగిరి, మేజర్ న్యూస్:** శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడమే పోలీసుల లక్ష్యమని భాకారా పేట ఎస్ఐ విజయ్ కుమార్ నాయక్ తెలిపారు.ఎస్పీ ఆదేశాలు మేరకు చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్రమైన ప్రతి చర్యలు పోలీస్ శాఖ నుండి ఉంటాయని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే ఏజెంట్లు, అభ్యర్థులు ఆర్ ఓ ఇచ్చిన ఐడి కార్డు, ఏదైనా ఒక అడ్రస్ ప్రూఫ్ ఉన్న ఐడి కార్డు మాత్రమే తీసుకుని రావాలన్నారు.ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా యాక్సెస్ కంట్రోల్ వద్ద తనిఖీ చేసిన తర్వాతనే సంబంధిత గేట్ల ద్వారా మహిళా యూనివర్సిటీ లోపలికి అనుమతిస్తామన్నారు. ఎవరూ పెన్నులు, హిడెన్ కెమెరాలు, వాటర్ బాటిళ్లు, మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వంటివి తమ వెంట తీసుకుని రాకూడదన్నారు . ఒకవేళ ఎవరైనా తీసుకుని వస్తే యాక్సెస్ కంట్రోల్ వద్దనే వారిని నిలువరించి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు, మొబైల్ పార్టీలు, మాబ్ కంట్రోల్ టీంలు, అరెస్టు టీంలు, స్ట్రైకింగ్ ఫోర్సు, క్విక్ రెస్పాన్స్ టీంలు వంటివి అన్ని రకాల బందాలు సన్నద్ధమై విధులలో ఉన్నాయని,ఎగ్జిట్ పోల్స్ కు సంబంధించి ఎవరు కానీ బాణసంచాలు కాల్చడం, వేడుకలు చేసుకోవడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషిద్ధం అన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గం పై ప్రత్యేక దష్టి సారించి శాంతి భద్రతల పరిరక్షణకు ఒక అదనపు ఎస్పి స్థాయి అధికారిని ఆధ్వర్యంలో ప్రతి సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పహారా కాస్తున్నామన్నారు.పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు.స్థానికులతో సమావేశమై ఎలక్షన్ కోడ్ తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ, పోలీస్ వారికి సహకరించాలని ఆయన కోరారు.

## చిన్న వయస్సులో చికిత్సతో అంగవైకల్యం నుంచి కాపాడొచ్చు : డాక్టర్ యు శ్రీహరి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పుట్టుకతో వంకర కలిగిన పిల్లలకు చిన్న వయస్సులో సరైన చికిత్స అందించడంతో అంగవైకల్లం నుంచి వారిని కాపాడవచ్చు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యు శ్రీహరి తెలిపారు. ప్రపంచ క్లబ్ ఫుట్ దినోత్సవం సందర్భంగా సోమవారం రుయా ఆసుత్రిలోని చిన్న పిల్లల విభాగంలో క్లబ్ ఫుట్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ఈ క్లబ్‌ఫుట్ ను 'తాలిప్స్ ఈక్వినోవారస్' అని కూడా పిలుస్తారని, ఇది శిశువు పాదాలను ప్రభావితం చేసే, పుట్టుకతో నవ శిశువులకు వచ్చే అరుదైన వ్యాధి అని, అది లోపలికి మెలితిప్పినట్లు చేస్తుందన్నారు. ఇది ఒకటి లేదా రెండు కాళ్లను



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యు.శ్రీహరి

ప్రభావితం చేయవచ్చుఅని, పిల్లలు సాధారణంగా నడవడం కష్టతరం అవుతుందన్నారు. క్లబ్‌ఫుట్‌లో, స్నాయువులకు (ఎముక) కండరాలను అనుసంధానించే కణజాలం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని, ఇది సాధారణంగా నవజాత శిశువులలో ఎటువంటి అసౌకర్యం లేదా నొప్పిని కలిగించదు కానీ పాదాల ఆకారం పరిమాణాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. ఈ విధంగా పిల్లలో పాదం వక్రంగా కిందికి లోపలికి తిరిగి ఉంటుందన్నారు. ఈ వంపును పెంచడం మడమను లోపలికి తిప్పడం వంటివి చేయవచ్చుఅని చెప్పారు. క్లబ్‌ఫుట్‌తో ఉన్న పిల్లలు అభివృద్ధి చెందని కాఫ్ కండరాలను కలిగి ఉంటారు. అందువల్ల వారు నిటారుగా నిలబడలేరు. అందువలన వారికి చిన్న వయస్సులోనే చికిత్స అందించంచడం ద్వారా వారిని వైకల్యం నుండి కాపాడుకోవచ్చని తెలియజేసారు. అందువలన ఈ సమస్య వున్న పిల్లలను పుట్టిన వెంటనే ఇక్కడకు తీసుకోనివస్తే వారిని అంగవైకల్యం నుండి కాపాడు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ సురేష్, హెచ్వోడి ఆర్థోపెడిక్ డాక్టర్ మనోహర్, హెచ్ ఓ డి, పీడియాట్రిక్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసన్ రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ శ్రీనివాసరావు, ఎస్ ఎన్ పద్మావతి, పి ఓ ఆర్ బి ఎస్ కే మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూ రెడ్డి, జిల్లా మానిటరింగ్ సెల్ వైద్య అధికారులు, డి ఐ ఈసీ సిబ్బంది పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయాన్ని దర్శించుకున్న భూమన అభినయ్


**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** నగరంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని సోమవారం తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ అతని మిత్రులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనికి తీర్థప్రసాదాలు అందజేశారు. భుమన అభినయ రెడ్డిని చిరంజీవి రెడ్డి ఘనంగా సత్కరించారు.



## ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

- ఎంఈఓ భువనేశ్వరి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు శ్రీ కాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది. శ్రీకాళహస్తి పట్టణం వివిధ ప్రైవేటు పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కందన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను తనిఖీలు నిర్వహించి, ఆ పాఠశాలకు రికగ్నేషన్ రానున్న విద్యా సంవత్సరంకు లేకపోవడంతో వెంటనే పాఠశాలను మూసివేయాలని పాఠశాలయాజమాన్యనికి తెలియజేశారు, అనుమతి పొందిన తర్వాతే పాఠశాల పున ప్రారంభించి అడ్మిషన్ చేసుకోవాల్సిందిగా పాఠశాల యాజమాన్యాన్ని తెలియజేశారు. అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణం శ్రీస్వామి వివేకానంద హై స్కూల్ ను పరిశీలించారు గతంలో వారిపై వచ్చిన ఫిర్యాదులపై పాఠశాల యాజమాన్యాన్ని, వివరణ కోరారు, మరోమారు వారి పాఠశాలపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన తగినవిధమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు జూన్ 12వ తేదీ మాత్రమే పాఠశాలలు పునఃప్రారంభించాలని ,ఈ లోపల ఏపాఠశాల అయినా ముందస్తుగా పాఠశాలను ప్రారంభిస్తే వారిపై తాగువిధమైన చర్యలు తీసుకుంటామని, అడ్మిషన్ సమయం నందు విద్యార్థులకు తీసుకుని ఫీజులపై నోటీస్ బోర్డ్ నందు నోటీసులు ఉంచాలని, అధిక ఫీజులు వసూలు చేసిన, నోటీస్ బోర్డు నందు విద్యార్ధులకు సంబంధించిన ఫీజుల వివరాలు పొందుపరచకపోయిన, వీటిపై ఎటువంటి ఫిర్యాదు వచ్చిన వెంటనే సంబంధిత పాఠశాలపై తగు విధమైన చర్యలు తీసుకుంటామని పాఠశాల యజమాన్యాన్ని తెలియజేశారు.



## మలేరియా వ్యతిరేక మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మలేరియా వ్యతిరేక మహోత్సవం పోస్టర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సోమ వారం అధికారులతో కలిసి డాక్టర్ యు శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ నుంచి 30 వరకు మలేరియా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎమ్మెల్ హెచ్‌పిలు, ఆశలు పాల్గొని దోమలు నివారణకు చర్యలు తీసుకొని, దోమలు అభివృద్ధి చెందే ప్రాంతాలలో మురికి నీరు నిలువలను పంచాయతీ సహకారంతో నిర్మూలించాలని ఆదేశించారు. ఈ నెలరోజు చేసే కార్యక్రమానికి సంబంధిం చిన రోజువారి ఫోటోలు గ్రూప్‌కు సెండ్ చేయాలని చూపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ శ్రీనివాసరావు, డిఎంఓ డాక్టర్ రూప్ కుమార్, మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూరెడ్డి, జిల్లా మానిటరింగ్ సెల్ వైద్యాధికారులు, ఎంపీహెచ్ఈవోలు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



## పులివర్తి నాని 20వేల మెజార్టీతో గెలుస్తారు

### - జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ బాషా

**చంద్రగిరి, మేజర్ న్యూస్:** సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నాని 20 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ బాషా తెలిపారు. చంద్రగిరిలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల్లో మార్పు వచ్చిందని చెప్పారు. ప్రజలతో పాటు ఉద్యోగులు తెలుగుదేశం పార్టీకి సహకరించాలని అందుకే చంద్రగిరి నియోజకవర్గంలో కాకుండా రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి పాకాల చిన్నగొట్టిగల్లు ఎర్రవారిపాలెం రామచంద్రాపురం తిరుపతి రోడ్డు మండలాల్లో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ వస్తుందని ఆయన పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ లోని టిడిపికి అత్యధికంగా వస్తాయని ఆయన పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా కావడం ఖాయమని చెప్పారు. సుదీర్ఘకాలంలో చరిత్ర తిరగరాసి టిడిపి జెండా చంద్రగిరి కోటపై ఎగురవేస్తామని ఆయన చెప్పారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానిని గెలిపించి చంద్రబాబు నాయుడుకు బహుమానం ఇస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలు నాని గెలుపు కోసం కష్టపడి పని చేశాయని చెప్పారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నాని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలు అందిస్తారన్నారు. భవిష్యత్తు తెలుగుదేశం పార్టీ దేని వివరించారు.



## ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం



పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ భువనేశ్వరి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పాఠ్యపుస్త కాలు పంపిణీ కార్యక్రమం విద్యా కానుక క్రింద పాఠ్య పుస్తకాలు. యూని ఫామ్స్. నోటు పుస్తకాలు. శ్రీకాళహస్తి విద్యాశాఖ కేంద్రాలకు చేరాయి, శ్రీకా ళహస్తి ఆర్‌పివిఎస్ జెడ్పి బాలుర ఉన్నత పాఠశాల నందు పొందుపరి చారు, వాటిని శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి పరిశీలించి, త్వరితగతిన ఈ విద్యా కానుక పాఠ్యపుస్తకాలను యూనిఫాం ఆయా పాఠశాలకు పంపించవలసిందిగా ఆమె సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భువనేశ్వరి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు రావాల్సిన విద్యా కానుక సామాగ్రి పాఠ్య పుస్తకాలు ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు తమ మండల కేంద్రాలకు చేరాయని, ఇక రావాల్సిన ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతి పాఠ్య పుస్తకాలు వచ్చిన వెంటనే ఆయా పాఠశాలలకు జూన్ 12వ తేదీ లోపల పంపిస్తామని తెలియజేశారు, ప్రస్తుతం 10360 జతల యూనిఫామ్స్, 45396 పాఠ్యపుస్తకాలు, 64367, రాత పుస్తకాలు, 789 ప్రైమరీ డిక్షనరీలు, తమకు చేరుకున్నాయని, వీటిని త్వరిత ఆయ ప్రభుత్వ పాఠశాలకు తరలించి విద్యార్థులకు జూన్ 12వ తేదీ అందజేస్తామని తెలియజేశారు, ఈ సంవత్సరం అడ్మిషన్స్ ఎక్కువగా జరిగే విధంగా ఉపాధ్యాయులతో పూర్తి కార్యాచరణ చేపట్టామని, ఈ పర్యయం అడ్మిషన్లు ఎక్కువ జరిగే విధంగా కార్యాచరణ చేపడతామని తెలియజేశారు.

## సోమిరెడ్డిని కలిసిన కోటేశ్వరరావు

**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిని నెల్లూరు నగరంలోని ఆయన నివాసంలో చిల్లకూరుకి చెందిన మల్లి కోటేశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్చం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లి కోటేశ్వర రావు మాట్లాడుతూ సోమి రెడ్డి చంద్ర మోహన్ రెడ్డి సర్వే పల్లి లో అఖండ మెజార్టీ తో గెలుపు పొందుతారని పేర్కొన్నారు. నేడు రానున్న సార్వ.త్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్.డి. ఏ కూటమి విజయం సాధిస్తుందన్నారు..



## చంద్రబాబు నాయుడు, నెలవల విజయశ్రీ గెలవాలని ప్రత్యేక పూజలు

**ఓజిలి, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేన, బిజెపి కూటమికే పట్టం కట్టనున్నట్లు ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సూళ్లూరుపేట ఎమ్మెల్యే గా నెలవల విజయశ్రీ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఓజిలి మండల తేదేపా సీనియర్ నేత కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్ తెలిపారు. మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అట్లా మల్లికార్జున్ యాదవ్ అధ్వర్యంలో సోమవారం ఓజిలి మండలం కేంద్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు విసుగు చెందిన ప్రజలు చంద్రబాబుకు పట్టం కడుతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు చంద్రబాబు నాయుడు నెలవల విజయశ్రీ న్యాయం చేస్తారని అలాగే సులూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని వారు ధీమా వ్యక్తంచేశారు. ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు విడుదల చేసిన ఫలితాల్లో టీడీపీ కూటమిదే విజయం అని తేలిపోయిందని వారు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. వైసీపీ వ్యతిరేక విదానాలకు ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నా రని ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడైంద న్నారు. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు టీడీపీ కూటమిదే అధికారం అని తేల్చాయన్నారు.జూన్ 4వ తారీఖున ఓట్ల లెక్కింపు సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం, ఎన్నో ఆటంకాలు కల్పించాలని చూస్తుంది. శివుని ఆశీస్సులతో, వినాయకుని దీవెనలతో ఆంధ్రదేశంలో, ఆంధ్ర ప్రజలకు, చంద్రబాబు నాయుడుకి సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థినెలవల విజయశ్రీ కిఅండగా ఉంటూ మీ ఆశీర్వాద బలంతో తొమ్మిదవ తారీఖున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి శివయ్య, విఘ్నేశ్వరుని ఆశీర్వాదం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తేదేపా సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు బిసి సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్,తేదేపా నాయకులు మైలం జయ చంద్ర రెడ్డి,మైలం మధుసూదన్ రెడ్డి, తేదేపా యువ నాయకులు అట్లా మల్లికార్జున్ యాదవ్, రఫీ,అలిమిలి కృష్ణారెడ్డి, సాయి,నన్నూరు వెంకటేశ్వర్లు, ఓజిలి భాస్కర్, దేవరపాటి శ్రీనివాసులు,కోటి, ముమ్మడి సుబ్రహ్మణ్యం, ముమ్మడి సుధాకర్, సిద్ధపరెడ్డి చెంచయ్య, తేదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## కిలివేటి గెలుపునకు ప్రత్యేక పూజలు...

**నాయుడుపేట, మేజర్ న్యూస్:** నాయుడుపేట పిచ్చిరెడ్డి తోపులో గల శ్రీ శ్రీ సిద్ధి వినాయక ఆలయంలో సోమవారం ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండవసారి విజయం సాధించే విధంగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్య ను దీవించు స్వామి అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే గా కిలివేటి సంజీవయ్య విజయాన్ని కోరుకుంటూ తమ నాయకులతో కలిపి శ్రీ విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆయన తెలిపారు. నిస్వార్థపరుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆసియ సాధన కొరకు అనునిత్యం అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజాక్షేత్రంలో అందరితో మమేకమై సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి పేదవారికి అందించే విషయంలో ఎక్కడ తగ్గకుండా స్వార్థం లేకుండా అడుగులు ముందుకు వేస్తున్న మనసున్న నాయకుడు కిలివేటి సంజీవయ్య మూడవసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని. భగవంతుని ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. పేద బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగు చూడాలన్న తపనతో బాపూజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయాలన్న ధ్యేయంతో పరిపాలన అందించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి. ఆంధ్ర రాష్ట్రానికి రెండవసారి ముఖ్యమంత్రిగా కావలసిన అవసరం ఉందని ప్రజల కోరిక. ప్రజల ఆశీస్సులతో భగవంతుని దీవెనతో 4.వ తేదీ వైసిపి గెలుపు అనే శబ్ద ధ్వనులతో రాష్ట్రం మొత్తం వినిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైసీపీ సీనియర్ నాయకులు బైన మల్లికార్జున్ రెడ్డి. తోట చంద్రారెడ్డి. కౌన్సిలర్ వెంకటే శ్వర్లు. వైసిపి నాయకులు పేర్నాటి రాహుల్. మెస్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**శాంతిపురం మేజర్‌న్యూస్:** నేడు ఎలక్షన్ కౌంటింగ్ ఎలక్షన్ కోడ్ ఉన్నందున ఎవరైనా గొడవలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడుతుందని కుప్పం రూరల్ సిఐ రాళ్ళబుదూగురు ఎస్సై తెలిపారు. అలాంటి వారి మీద రౌడీషీట్స్ తెరిచి రెండు లక్షల రూపాయలు డబ్బులు ఎమ్మార్వో ద్వారా ప్రభుత్వానికి మీ నుంచి కట్టించడం జరుగుతుంది అన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగే విధంగా ఎవరైనా ప్రవర్తించినా వారు ఏ రాజకీయ పార్టీకి చెందిన, ఎంతటి పెద్ద వారైనా క్షమించేది లేదు కావున మీ కుటుంబంలో ఉన్న ఆవేశపరులను మీరే కంట్రోల్ చేసుకుంటూ, మీరే ప్రశాంతంగా ఉండి గొడవలకు పోయి, జైలుకు పాలు కాకుండా ఉండాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్ కోడ్ ఉన్నంత వరకు శాంతిపురం మండలంలో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ ఉన్నందున ఎవరు నలుగురికి మించి ఉండకూడదు, తిరగకూడదు, ర్యాలీలు, టపాసులు కాల్చడం, బైక్ ర్యాలీలు, కేకులు కట్ చేయడం నిషేధం. ఈ నెల 03,04,05 వ తేదీలు “డ్రై” డేస్ కావున ఎవరు కూడా మద్యం తాగి, అనవసర గొడవలకు కారణం అయితే వారిపైన, సోషల్ మీడియా అయిన వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్ మొదలగు సోషల్ మీడియా నందు ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వీడియో క్లిప్పింగ్స్, పోస్ట్ కామెంట్స్ చేయడం వలన గొడవలకు కారణమైతే సదరు గ్రూప్ అడ్మిన్లను కూడా బాధ్యులను చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకో పడతాయని రాళ్ళబూదుగురు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వి సుమన్ పత్రికా ముఖంగా తెలిపారు.



# ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

**కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి**

**సిబ్బంది ఆలస్యంగా వస్తే సస్పెండ్ చేస్తాం**

**జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** జిల్లాలో మే 13న నిర్వహించిన ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడం జరిగింది. అదే స్ఫూర్తితో ఓట్లు లెక్కింపు ప్రక్రియను ప్రశాంత ంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం డిఆర్ ఓ.బి.పుల్లయ్య, ఏఆర్ఓలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ, చిత్తూరు, గుడిపాల తహశీల్దార్ల తో కలిసి సోమ, మంగళవారం రోజులు 172 చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించి ఓట్లు లెక్కింపు ఎస్‌విసెట్ నందు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం ఓట్లు లెక్కింపు కేంద్రం నందు విధులు నిర్వహించే కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెం ట్లు సూపర్ వైజర్లు, సూక్ష్మ పరిశీలకులుకు రెండో విడత నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మే 13న నిర్వహించిన ఎలక్షన్స్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడం జరిగింది. అదేస్ఫూర్తితో ఓట్లు లెక్కింపు ప్రక్రియను విజయవం తంగా నిర్వహిద్దామని తెలిపారు. ఈవీఎంస్ ద్వారా ఓట్లు లెక్కింపు సంబంధించి టేబుల్స్ దగ్గరికి కంట్రోల్ యూనిట్‌ను, 17సిని తెచ్చి ఇవ్వడం జరుగుతుందని, ముందుగా కంట్రోల్ యూనిట్ సంబంధించి స్విచ్ఛి ఆన్ చేసుకోవాలని, కంట్రోల్ యూనిట్ లోను 17సీలో ఉన్న నెంబరు ఒక్కటిగా ఉంటే ఎలాంటి సమస్యలు ఉండదన్నారు. అభ్యర్థుల వారిగా పోలైన ఓట్లును ఫ్రోపరంలో కౌంటింగ్ ఏజెంట్లుతో సంతకం చేయించిన తర్వాత ఆర్ఓ పంపించాలన్నారు. సియు ద్వారా ఓట్లు లెక్కింపుకు సంబంధించి అభ్యర్థులు ఏజెంట్లకు రెండు సార్లుగా ఫలితాలు ను వివరించాలన్నారు. కంట్రోల్ యూనిట్ లో ఏమైనా ఇబ్బంది కలిగితే బెల్ ఇంజనీర్లు అందుబాటులో ఉంటారని వారికి తెలియజేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఇబ్బందులు ఉంటే వెంటనే ఆర్ఓ దృష్టికి తీసుకురావాలని సుపెరువైజర్లను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లు లెక్కింపుకు సంబంధించి అభ్యర్థులకు, ఏజెంట్లుకు చూపి స్తూ జాగ్రత్తగా లెక్కింపు చేయాలని కౌంటింగ్ సుపెరువైజర్లును ఆదేశించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి ఓట్లు లెక్కింపుకు 14 టేబుల్స్ ద్వారా 17 రౌండ్లు పూర్తవుతుందని, కౌంటింగ్ టేబుల్స్ కు 19 మంది సూపర్వైజర్లు, 25 మంది అసిస్టెంట్ సూపర్వైజర్లు, 22 మంది సూక్ష్మపరిశీలకులు, చిత్తూరు పార్లమెంటరీ సెగ్మెంట్‌కి సంబంధించి 14 టేబుల్స్ ను 16 మంది సూపర్వైజర్లు, 17 మంది అసిస్టెంట్ సూపర్వైజర్లు, 19 సూక్ష్మ పరిశీలకులు నియమించడం జరిగింది అని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్స్ మొత్తం 4వేలు రావడం జరిగిందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్స్‌ను 25 చొప్పున కట్టలు కట్టి ప్రతి టేబుల్‌కు 500 ఓట్లును ఇవ్వడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు రెండు టేబుల్స్ ద్వారా నాలుగు రౌండ్లు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్‌కు విధులు కేటాయించిన సిబ్బంది అందరు ఉదయం 6గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, అప్పుడు మీకు టేబుల్‌ను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన సిబ్బందికి మహిళలకు నర్సింగ్ కాలేజీలోను, మగవారికి ఆర్‌విఎస్ కళాశాల నందు అకామిడేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను, పెన్స్ కూడా తీసుకొని రాకూడదన్నారు. మొబైల్ తెచ్చి ఉంటే మెయిన్ గేట్ వద్ద కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడే పెట్టేసి రావాలన్నారు. కౌంటింగ్ విధులకు ఆలస్యంగా వస్తే వెంటనే సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీటీలు హిమగిరి, కిరణ్, ధనంజయులు, కౌంటింగ్ టేబుల్స్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు సూక్ష్మపరిశీలకులు, విఆర్ఓలు పాల్గొన్నారు.



# కౌంటింగ్ కేంద్రం ఐజీ పరిశీలన

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఐజికెవి మోహన్ రావు పరిశీలించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన చిత్తూరు నగర సమీపంలోని ఎస్‌విసెట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి సమీక్షించారు. మంగళవారం జరుగు ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాకు వచ్చిన ఐ.జి. కె.వి.మోహన్ రావుకి జిల్లా ఎస్పీ పూల గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐజి జిల్లా ఎస్పీ ఇతర జిల్లా అధికారులతో సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. కాలేజీ పరిసరాలు, పార్కింగ్ ప్రదేశాలు, కౌంటింగ్ గదులు, సి.సి.కెమెరాల పని తీరు, స్ట్రాంగ్ రూమ్లు మరియు మీడియా పాత్రికేయుల వెయిటింగ్ హాల్ లను పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ శాంతి యుతంగా ప్రశాంత వాతావరణంలో జరగడానికి తీసుకున్న చర్యల గురించి ఎస్పీ క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ఐజి మాట్లాడుతూ మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ఎంతో పగడ్బందీగా జరిపించాలని దానికి గాను తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా మరియు పారదర్శకంగా జరిపించాలని, కౌంటింగ్ గదుల్లో ఉన్న సిబ్బంది క్రమశిక్షణ, నిష్పక్షపాత ధోరణితో పనిచేయాలని ఆదేశించారు. రేపటి రోజు ఎంతో కీలకమని శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసు అధికారుల నుండి సిబ్బంది వరకు అందరు తమ విధులను ఎంతో క్రమశిక్షణతో, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని, ఎవరైనా తమ విధుల పట్ల అలసత్వం వహిస్తే ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని తెలిపారు.





# కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్ల పర్యవేక్షణ

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:**

కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ ఎలక్షన్ కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ లు సోమవారం పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలతో మూడంచెల భద్రత ఉందని తెలిపారు. అధునాతన సీసీ కెమెరాల తో పటిష్టమైన నిఘా ఉంటుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు సులభంగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే విధంగా లాజిస్టిక్స్ ఏర్పాటు చేశారు. ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు, యాక్సెస్ కంట్రోల్ పాయింట్ల నుండి కౌంటింగ్ కేంద్రాన్ని అనుసంధానిస్తూ బ్యారికేడ్‌లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలను రెడ్ జోన్/ నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రెడ్ జోన్ నిబంధనలను ఎవరైనా అతిక్రమించి డ్రోన్ కెమెరాలను ఎగురవేస్తే తీవ్రమైన కఠిన చర్యలు ఉంటాయని,ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు , జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ వారు క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



# భక్తాగ్రేశ్వరుడుపై వేణుగోపాలుడు విహారం

**రాత్రి గజవాహనంపై ఊరేగిన మువ్వగోపాలుడు**



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** భక్తాగ్రేశ్వరుడిపై హనుమంతు లోక రక్షకుడైన వేణుగోపాల స్వామి కొలువుతీరి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా సోమవారం ఉదయం హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో మేలు కొలిపి శుద్ధితోమాల కొలు వు పంచాంగ శ్రవణం అర్చన మొదటి గంట సర్వదర్శనం, ఊరేగింపు అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె హరిద్రవం నారికెల జలం సుగంధ ద్రవ్యాలతో స్థాపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో వసంతోత్సవం, స్వామి వారికి ఆస్థానం మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచార్లసమేతుడైన స్వామి వారికి ఊంజల సేవ సేద తీరారు, అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే హరికథ నిర్వహించారు. రాత్రి గజవాహనపై ఊరేగిన మువ్వ గోపాలుడు వార్షిక బ్రహ్మోత్సవాలు. వేణుగోపాల స్వామి సోమవారం రాత్రి స్వామి వారు గజ వాహనంపై సర్వాంగ సుందరంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గజ వాహనంపై ఊరేగింపు తిలకించడానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అధిరోహించి తిరు వీధిలో విహరించారు. కోలాటాలు భజన కోలాహలంగా నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు అనంతరం స్వామివారికి ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, సూపర్డెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్ బాబు, షరాబు రమేష్ కుమార్, కంకణ భట్టాచార్యులు దాశరధి, గోపాలచార్యులు, భక్తులు మహిళలు ఆది సంఖ్యలో పాల్గొన్నారు. గోపురం పూర్తిగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ
దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి
వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు
ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా
అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116



# మంత్రి పెద్దిరెడ్డికి అభినందనలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** 2024 ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవబోతున్న నేపథ్యంలో ఆయనకు పలువురు వైఎస్ఆర్సీపీ నేతలు అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ముందస్తుగా సోమవారం మంత్రి నివాసంలో పెద్దరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలియజేసిన వారిలో వైఎస్ఆర్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు, బీసీ సెల్ కార్యదర్శి నాగేంద్ర, పలువరు వైఎస్ఆర్సీపీ నేతలు ఉన్నారు.

## శ్రీవారి సేవలో మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి

**తిరుమల, మేజర్‌న్యూస్:** మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.ఆలయం వెలుపల మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి మీడియాతో మాట్లాడుతూ ఇప్పుడు వచ్చిన చాలా ఎగ్జిట్ పోల్స్ తప్పు వస్తున్నాయన్ని స్పష్టం చేశారు. దేశ ప్రగతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ఏపికి పట్టిన దరిద్రం తొలగిపోతుందని తెలిపిన ఆమె మంచి రోజులు రానున్నాయన్నారు.



## శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ, వర్తమాన నటి సుమలత

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఎంపీ, వర్తమాన నటి సుమలత దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల ఎంపీ.,వర్తమాన నటి సుమలత మాట్లాడుతూ బీజేపీ పార్టీ మరోమారు దేశంలో అధికారం చేపట్టనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ చెప్తున్నాయన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. స్టేట్ పాలిటిక్స్ వైపు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. కొన్ని వదంతులు రావడం సర్వసాధారణమని తెలిపారు.



# పిల్లల్లో సృజనాత్మకత వెల్లివిరిసింది

### - వేమన విజ్ఞాన కేంద్రం సమ్మర్ క్యాంప్ ముగింపు సభలో డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలలో సృజనాత్మకత వెలివిరిసిందని ఇలాంటి సంస్థలు మరిన్ని కార్యక్రమాలు చేపడితే పిల్లల్లో నిగూఢంగా ఉన్న అనేక సామర్థ్యాలు బయటికి వస్తాయని డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల అన్నారు.గత నెల రోజులుగా యశోదా నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు సమ్మర్ క్యాంపును నిర్వహించారు. 200 మందికి పైగా పిల్లలు, పేరెంట్స్ ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొన్నారు. మ్యాజిక్, పాటలు, ఆటల పోటీలు, చిత్రలేఖనం, చెస్, కర్ర సాము తదితర విభాగాల్లో వీరికి శిక్షణ ఇచ్చారు. సోమవారం నాటి ఉదయం వేసవి శిక్షణా కార్యక్రమం ముగింపు ఉత్సవం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. తిరుపతి నగరంలోని పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేమన విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ప్రముఖ న్యాయవాది మట్టా పురుషోత్తం రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు సోము రవికుమార్ లు ప్రసంగిస్తూ... పసిపిల్లలే యాంకరింగ్ చేస్తూ కార్యక్రమ రూపకల్పన చేసి వివిధ రూపాలలో ప్రదర్శనలు ఇవ్వడాన్ని ప్రశంసించారు. జానపద, శాస్త్రీయ, నృత్య పోటీలు అద్భుతంగా నిర్వహించారని ఆయన పిల్లలను అభినందించారు.వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 35 రోజులపాటు కర్రసాము ప్రదర్శనను నిర్వహించారు. 75 ఏళ్ల ప్రాయంలో డా"రమేష్ నాథ్ లింగుట్ల కర్రసాము చేసే కార్యక్రమాన్ని ప్రారంబించారు. కర్రసాము మాస్టారు మునిరాజు వద్ద నేర్చుకున్న పిల్లలు, పెద్దలు, మహిళలు తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శించారు.అనంతరం కళారూపాల ప్రదర్శన కార్యక్రమాన్ని పిల్లలే నిర్వహించారు.అనంతరం పిల్లలు దేశభక్తిగీతాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. తలపైన మంటలు పెట్టుకొన్న మ్యాజిక్ ను పిల్లలు ప్రదర్శించి ప్రేక్షకులను అబ్బురపరిచారు.



ఈ కార్యక్రమం వ్యాపారం కాదని నిజమైన విలువైన భావాలను వ్యాప్తి చేస్తుందన్నారు. ప్రముఖ చిత్రకారులు కిరణ్ కుమారి, అర్చన, భువనేశ్వరి, గాయత్రి పిల్లలచే వేయించిన చిత్రాలను ప్రదర్శింప జేశారు.

వేమనవిజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుండి జూన్ 2 వరకు జరిగిన సమ్మర్ క్యాంపులోవివిధ రంగాల్లో నిష్ణాతులైన గురువుల కృషివల్ల పిల్లలు బాగా రాణించారని అన్నారు. యాంత్రికంగా ఉన్న పిల్లల జీవితాల్లో ఈ శిక్షణ ఉత్సాహం నింపిందని, వీరిలోని సృజనను వెలికి తీయగలిగామని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో శిక్షణ ఇచ్చిన గురువులందరినీ వేమనవిజ్ఞానకేంద్రం నిర్వాహకులు టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, మునిలక్ష్మి, గురునాథం, ఓ. వెంకట్రమణ, రఫీ తదితరులు మెమెంటోలు, కండువాలు, పుస్తకాలతో సత్కరించారు. చిత్రలేఖనంలో విజేతలకు, సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందినవారికి జన విజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్ బాబు, అరుణ్ శివప్రసాద్, గిరిధర్ మూర్తి, బిర్లా నాయుడు బహుమతులుఅందించారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలందరికీ సర్టిఫికేట్స్ అందించారు.

# పదవీ విరమణ పొందిన జిల్లా అధికారికి సన్మానం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది, కత్తిరిపల్లి లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది. జిల్లా వ్యాధి నిరోధకల టీకాల అధికారి డా. రవిరాజు పదవీ విరమణ కావడంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 3 దశాబ్దాల పాటు విశేష సేవలందించి ప్రభుత్వ వైద్యశాల ద్వారా పేదల పాలిట పెన్నిధిగా ప్రభుత్వ వైద్యం పట్ల విశ్వాసం కలిగించారు. ఎంతోమందికి ప్రాణదాతగానిలిచారు. కార్వేటి నగరం ప్రభుత్వ వైద్యాధికారిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రభుత్వ డాక్టర్ గా చేరి జిల్లా వైద్యాధికారిగా వివిధ హెూదాల్లో సేవలందించి వైద్య ఉద్యోగులకు అండగానిలిచారు. రెండు దశాబ్దాల క్రితం మొదటగా కార్వేటినగరం ప్రాంతంలో ఆంత్రాక్స్ వ్యాధిని గుర్తించి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. పుత్తూరు ప్రాంతంలో కరోనా సమయంలో ప్రభుత్వ వైద్యాధికారిగా ప్రజలకు విశేష సేవలందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ ఎంఐ) జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర,జాతీయ స్థాయిలో వివిధ హెూదాల్లో పని చేశారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ద్వారా కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇతని సేవలు కొనియాడారు. వైద్యులు డాక్టర్ గోపీనాథ్ ,శృతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి విరామ సమయంలో శ్రీ కాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, రాయచోటి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి, సినీ నిర్మాత కారుమంచి వంశీలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

